క్లుప్తంగా

నేడు కాంట్రాక్టు, శానిటేషన్ కమిటీల సమావేశం

సామర్లకోట: మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన బుధవారం ఉదయం కాంట్రాక్టు, శానిటేషన్ కమిటీల సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. ఈ సమావేశానికి కమిటీల సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

బాలికల చదువుకు ప్రాధాన్యం



సామర్లకోటలో సావిత్రీబాయికి నివాళులు

సామర్లకోట: బాలికల విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చే శారని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వి.రాజు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైస్కూల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయినులను సత్కరించా రు. మహిళల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేశారని సీనియర్ ఉపాధ్యాయినులు కె.అరుణ, ఏఎల్‌వీ కుమారి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.గోవిందు, తాళ్లూరి వైకుంఠం, కేవీవీ సత్యనారాయణ, ఎ.శ్రీవల్లీ, డీవీఆర్‌ఎన్ వల్లీ, కె శ్రీనివాసు, బ్రహ్మానందం పాల్గొన్నారు.

విశాఖ వెళ్లి పింఛను అందజేత



విశాఖలోని ఆసుపత్రిలో పింఛను అందజేస్తున్న వలంటీర్ వీరబాబు

కొత్తపల్లి: వాకతిప్పకు చెందిన వికలాంగ బాలుడు కొప్పిశెట్టి వెంకటరమణ విశాఖపట్నంలోన ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ గీసాల వీరబాబు తన సొంత ఖర్చులతో మంగళవారం విశాఖలోని ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశాడు.

నగర సంకీర్తన బృందానికి స్వాగతం



నగర సంకీర్తన బృందం పూజలు

సామర్లకోట: ధనుర్మాసం సందర్భంగా స్థానిక విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ నాయకుడు నమ్మి శ్రీనివాసు ఆధ్వర్యంలో వీర్రావపురం నుంచి బలుసులపేట వరకు ఈ నగర సంకీర్తన నిర్వహించారు. బలుసులపేటకు వచ్చిన బృందానికి ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు, పంచారామక్షేత్ర ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి స్వాగతం పలికారు. నగర సంకీర్తనలో వంద మంది పాల్గొన్నట్టు నమ్మి శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు రామాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హరిబాబు దంపతులు నగర సంకీర్తన బృందానికి అల్పాహార ఏర్పాట్లు చేశారు.

మెరుగైన వైద్య సేవలందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజప్ప

పెద్దాపురం: ఆసుపత్రికి వచ్చే రోగులపై మంచి ప్రవర్తనతో మెరుగైన వైద్య సేవలందించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ ప్రజలకు దైవ సమానులు వైద్యులన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. తొలుత ఆయా వార్డులో పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యాక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బరి మే సవాల్..



- పందేలకు సిద్ధమవుతున్న కోళ్లు
- ప్రత్యేక శిక్షణ ఇస్తున్న పెంపకందారులు
- సంక్రాంతికి సై అంటున్న పందెగాళ్లు

సామర్లకోట: సంక్రాంతి వస్తోందంటే చాలు.. పందేలకు కోళ్ల కాళ్లు దువ్వుతాయి. కోడి పందేలపై నిషేధం ఉన్నా.. ఏటా సంక్రాంతి మూడు రోజుల పాటు వీటిని సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తుంటారు. దీంతో ఈ సీజన్‌లో పెంపకందారులు కోడి పుంజుల పెంపకంపై దృష్టి సారిస్తారు.

పందెం కోళ్ల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ

సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేని ఆహారాన్ని పందెం కోడి పుంజులకు వేస్తున్నారు. కోడి పుంజులు బలంగా తయారు కావడానికి మేక మాంసం కైమా, కోడిగుడ్లు, జీడి పప్పు, నెత్తలు, ఖర్జూరం, బాదం పప్పు, కిస్‌మిస్ వేసి మరీ పెంచుతున్నారు. వీటితో పాటు ప్రతి రోజు ఒక రకమైన ఆకు కూరలు కూడా పందెం పుంజులకు వేసి తయారు చేస్తున్నారు. పందెం కోడి పుంజులు శరీరం బలంగా తయారు కావడానికి నీటిలో వదలి ఈత కొట్టే విధంగా శిక్షణ ఇస్తున్నారు. అదే విధంగా నెలకోసారి వివిధ రకాల ఆకులు, ఆయుర్వేదం మందును నీటిలో మరిగించి ఆ నీటితో పుంజులకు మసాజు చేస్తున్నారు. ఈ పందెం కోళ్లను డేగ, నెమలి, పచ్చకాకి, చెవల, చేరువ, రసంగి, కత్తిరాయి, నల్ల కత్తిరాయి, గౌళ్ల పేరుతో పిలుస్తుంటారు.



పందెం పుంజును నీటిలో ఈత కొట్టిస్తున్న పెంపకందారుడు

పందెపు పుంజులకు డిమాండ్

కొత్తపల్లి: భోగి, సంక్రాంతి, కనుమ పండుగ మూడు రోజులూ కోడి పందేలను నిర్వహించేందుకు పందేల రాయుళ్లు మండలంలో ఇప్పటి నుంచే బరులను సిద్ధం చేస్తున్నారు. మరోపక్క పందెం కోళ్ల పెంపకందారులు సంక్రాంతి కోడి పందేలకు వాటిని విక్రయించి, సొమ్ములు చేసుకునే పనిలో ఉన్నారు. పందేల కోడి పుంజులకు గత 3, 4 నెలలుగా వారు తర్ఫీదు ఇచ్చారు. ఈ సంక్రాంతికి పందెపుదె కోడి పుంజులకు మంచి గిరాకీ ఏర్పడింది. కోడి పుంజు జాతిని, రంగును బట్టి రూ.ఐదు వేల నుంచి రూ.లక్ష వరకూ ధర పలుకుతోంది. పందెం కోడి పుంజులకు రారాజుగా భావించే మేలురకం నల్ల చెవల రూ.50 వేల నుంచి రూ.75 వేల రేటు పలుకుతోంది. కాకి నెమలి, ఎర్ర నెమలి, కాకి డేగ, పచ్చకాకి డేగ, డేగ, పండు డేగ, కాకి, పంగిలి చవలతో పాటు పలు రకాలు పందెపు కోడి పుంజులు ఉన్నాయి.



విక్రయానికి సిద్ధమైన పందెపు కోళ్లు



పందేనికి సిద్ధంగా..

తాతల కాలం నుంచి పెంపకం..



వీకే రాయపురం గ్రామంలో సుమారు 60 ఏళ్ల నుంచి అంటే మా తాతల కాలం నుంచి పాల డెయిరీ, కోడి పుంజులు, ఇటుక బట్టీలను తమ పొలంలో నిర్వహిస్తున్నాం. సుమారు వంద పుంజుల వరకు తయారు చేస్తున్నాం. సంక్రాంతికి మూడు నెలల ముందు నుంచి కోడి పుంజులను సిద్ధం చేస్తాం. రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు పుంజు ఉంటుంది. కోడి పందేలు పూర్వం నుంచి అనవాయితీగా జరుగుతున్నాయి. సంక్రాంతికి మూడు రోజులు వీటిరి ఒక క్రీడగా తీసుకొని అనుమతివ్వాలి.

– తలారి దొరబాబు, కోడి పుంజుల పెంపకందారుడు, వీకే రాయపురం

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



సంక్రాంతి సంప్రదాయం పేరుతో చట్టాలను ఉల్లంఘించి ఎవరైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కోడి పందేలు, జూదాలకు వ్యతిరేకంగా ఇప్పటికే గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాం. పందేల నిర్వాహకులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశాం. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకూ కోడి పందేలపై పోలీసుల నిఘా పెంచాం. సంక్రాంతిని కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలి.

– రామలింగేశ్వరరావు, ఎస్సై, కొత్తపల్లి



సంక్రాంతి సందడిని గుర్తు చేస్తూ పందేలకు సై అంటున్న కోడి పుంజులు



వీకే రాయపురంలో సంక్రాంతి పందేల కోసం సిద్ధంగా ఉన్న కోడి పుంజులు



బాదం పిస్తా తింటున్న కోడి పుంజు

బాధితులకు అండగా ప్రభుత్వం



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గొల్లప్రోలు అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

పిఠాపురం: ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అగ్నిప్రమాద బాధితులకు ధైర్యం చెప్పారు. గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో గోనె సంచుల గొడౌన్, ప్లాస్టిక్ సంచుల షాపు, టెంట్ హౌస్ కాలి బూడిదయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. ప్రభుత్వాధికారులతో మాట్లాడిన ఆయన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు. బాధితులను పరామర్శించిన ఆయన వారికి ధైర్యం చెప్పారు. ఆయన వెంట పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు తెడ్లపు చిన్నారావు, మొగలి బాబ్జి, వైఎస్సార్‌సీపీ నేతలు పర్ల రాజా, మొగలి అయ్యారావు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఉన్నారు.

పింఛన్లపై టీడీపీ, జనసేనలది రాద్ధాంతం

- అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నాం
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో కొత్త పింఛన్ల పంపిణీ

పిఠాపురం: అర్హతే ప్రామాణికంగా అందరికీ ఎలాంటి సిఫార్సులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన పిఠాపురంలో మంగళవారం పేదలకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు ఇవ్వకపోతే ఇవ్వలేదంటారు. ఇస్తే అనర్హులకు ఇస్తున్నారంటారు. ఏదో ఒక రాద్ధాంతం చేయడం తప్ప మరే ఇతర వ్యాపకం లేకుండా పోతోందని టీడీపీ, జనసేన నేతల తీరును దుయ్యబట్టారు. గతంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉంటేనే పింఛన్ వచ్చేదన్నారు.



పేదలకు పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

అప్పుడు జనసేన నేతలు ఎందుకు పట్టించుకోలేదని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లలో ఎక్కడైనా అనర్హులు ఉంటే అర్హులకు అన్యాయం జరుగుతుందన్న ఉద్దేశవతో అర్హతలను పరిశీలిస్తుంటే టీడీపీ నేతలు దానిని రాద్ధాంతం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇప్పటి వరకూ ఎక్కడా పింఛన్లను తొలగించకపోయినా వందల సంఖ్యలో పింఛన్లు తీసేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తూ లబ్ధిదారులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆయన టీడీపీ జనసేన నేతల తీరును దుయ్యబట్టారు. చరిత్రలో ప్రస్తుత ప్రభుత్వం మాదిరిగా ఎక్కడైనా ఏరాష్ట్రంలో అయినా పింఛన్లు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా? అంటూ దొరబాబు ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన పిఠాపురం పట్టణం, మండలంలో ఇప్పవరకూ ఇస్తున్న పింఛన్లు 10,823 (రూ 2,64,16,500) ఉండగా కొత్తగా 333 (రూ 9,26,500) మందికి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నడిగట్ల చింతలరావు, కొప్పన శివనాథ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



సామర్లకోటలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన ఎండీయూ ఆపరేటర్లు

సామర్లకోట: ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం సాయంత్రం తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారికి వినతి పత్రం అందజేశారు. ఇంటింటికి రేషన్ ఇస్తున్న సమయంలో సివిల్ సప్లయ్ అధికారులు నూతన ప్రక్రియ ప్రారంభించడంతో సమస్యలు ఎదురవుతున్నాయని ఎండీయూ ఆపరేటర్ల సంఘ అధ్యక్షుడు దర్శిపాటి సత్యానందం తెలిపారు. లబ్ధిదారుల నుంచి బియ్యం ఇచ్చిన సమయంలో ఒకసారి వేలి ముద్ర, పప్పులు, పంచదార ఇచ్చిన సమయంలో మరోసారి వేలిముద్ర వేయించాలనే నిబంధన విధించామన్నారు. దీని కారణంగా ఒకసారి వేలి ముద్ర వేసిన తరువాత మరోసారి వేలి ముద్ర వేయడానికి సమయం పడుతుందని, దాంతో లబ్ధిదారులు రెండు సార్లు వేలి ముద్రలు వేయడానికి అంగీకరించడం లేదన్నారు. దీనికి తోడు సిగ్నల్ సక్రమంగా లేకపోవడం వల్ల సరకులు సకాలంలో ఇచ్చే అవకాశం లేదని ఎండీయూ ఆపరేటర్లు తెలిపారు. ఒకసారి వేలిముద్రతో ప్రభుత్వం ఇచ్చే అన్ని సరకులు ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఓ రమణి, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ శ్రీనివాసు, ఎండీయూ ఆపరేటర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలు తెరిచిన 300 మంది లబ్ధిదారులు



మెప్మా కార్యాలయంలో బ్యాంకు ఖాతాలు ప్రారంబించడానికి బారులు తీసిన మహిళలు

సామర్లకోట: జగనన్న ఇళ్ల కాలనీలు వేగంగా జరగడానికి ప్రభుత్వం కృషి చేస్తోమని హౌసింగ్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. అనేక మంది ఇళ్ల నిర్మాణానికి ఆర్థికంగా ఇబ్బంది పడడంతో రూ.2.15 లక్షలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మాణం చేసి ఇస్తున్నట్టు ప్రకటించింది. ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయం రూ.1.80 లక్షలు కాగా మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు ఇస్తున్న రూ.35వేలు కలిపి ఇంటి నిర్మాణానికి కాంట్రాక్టర్‌ను నియమించారు. దాంతో ఇప్పటి వరకు 300 మంది ముందుకు వచ్చి పెద్దాపురం ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతాలు ప్రారంభించినట్టు తెలిపారు. మహిళా సంఘాల్లో లేని వారు రూ.35 వేలు చెల్లించడానికి ముందుకు వచ్చి బ్యాంకులో డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలి

పెద్దాపురం: సావిత్రీబాయి పూలేను ప్రతీ మహిళ ఆదర్శంగా తీసుకుని ఉద్యమస్ఫూర్తితో విద్య, రక్షణ కోసం ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు ఇ.ఉమామహేశ్వరి అన్నారు. సావిత్రిభాయి 192వ జయంతిని పురస్కరించుకుని స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సావిత్రి అధ్యక్షతన జరిగిన సభలో ఉమామహేశ్వరి మాట్లాడుతూ మహిళల చదువుల కోసం సావిత్రబాయి పూలే ఎంతో కృషి చేశారన్నారు. దేశంలోనే మొదటి మహిళా టీచర్‌గా ఆమె చేసిన కృషి ఎనలేనిదన్నారు. మహిళల అక్షరాస్యత నేటికీ కూడా దేశంలో సగం కూడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో కరక సుబ్బలక్ష్మి, రొంగల సుబ్బలక్ష్మి, సత్య, లక్ష్మి, అమృత, నమ్రత, అఖిల, పీఎస్‌ఎం నాయకులు డి.కృష్ణ, ఆర్.వీర్రాజు, డి.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కొత్తపల్లి: భారతదేవ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని మండలంలోని పలు పాఠశాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండెవరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆమె చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మహిళా చైతన్యం కోసం ఆమె చేసిన పోరాటాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.



సావిత్రీ బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

3,820 టన్నుల ధాన్యం సేకరణ

- మండల వ్యవసాయాధికారి జోగిరాజు

కొత్తపల్లి: ఇప్పటి వరకూ మండలంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం 3,820 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు మండల వ్యవసాయాధికారి వి.జోగిరాజు తెలిపారు. మండలంలోని వాకతిప్ప, కొమరగిరి గ్రామాల్లో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలుపై రైతుల అభిప్రాయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు సిబ్బంది రైతుల కళ్లాలకు వెళ్లి ధాన్యాన్ని సేకరిస్తున్నారన్నారు. హమాలీలు, ధాన్యం రవాణా చార్జీలతో పాటు సంచులను కూడా ప్రభుత్వమే అందిస్తోందన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు తరలించనున్నట్టు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజనూ, తుపానులకు రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేలా అన్ని చర్యలూ చేపట్టిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల బ్యాంకు ఖాతాలకు పంట సొమ్మును జమ చేస్తామన్నారు

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి: కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్ల పంపిణీని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేస్తామని ఎంపీడీఓ నందూరి ప్రభాకర రామారావు మంగళవారం తెలిపారు. మండలానికి కొత్తగా 443 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందించడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. అర్హులైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేప సామర్లకోట మండలంలో..

సామర్లకోట: మండలంలోని 18 గ్రామాల్లో కొత్తగా మంజూరైన పింఛన్లు ఈనెల 5వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంపిణీ చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ వీవీ సాయిబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేస్తారని తెలిపారు.

భైరిపై చర్యలకు వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ డిమాండ్



పిఠాపురం సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, అయ్యప్ప భక్తులు

పిఠాపురం: హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాస్తిక సంఘ నాయకుడు భైరి నరేష్ ఇతర నాయకులను వెంటనే అరెస్టు చేయాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు డిమాండ్ చేశారు. గొల్లప్రోలులో మంగళవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు ఆందోళన చేశారు. ర్యాలీ నిర్వహించిన వారు తహసీల్దారు కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం వారు పోలీసు స్టేషన్‌లో భైరి రమేష్‌పై పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పలువురు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

డైనింగ్ హాల్ ప్రారంభం

కాకినాడ: కాకినాడ డీప్‌వాటర్ పోర్టులో ఎగుమతులు, దిగుమతులు సాగిస్తున్న కేఎస్‌పీఎల్ సంస్థ దుమ్ములపేట పాఠశాలలో రూ.40 లక్షల సీఎస్సార్ నిధులతో నిర్మించిన డైనింగ్‌హాల్‌ను కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న, కమిషనర్ కె.రమేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌడా చైర్ పర్సన్ చంద్రకళాదీప్తి మాట్లాడుతూ విద్యారంగ ప్రగతికి విద్యార్థుల అభ్యున్నతికి కేఎస్‌పీఎల్ వంటి సంస్థలు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న మాట్లాడుతూ గతంలో కేఎస్‌పీఎల్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటునిచ్చిందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ రమేష్, కేఎస్‌పీఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మురళీధర్, జీఎం ఆపరేషన్స్ జాకబ్ సత్యరాజు, ఎస్ఈ సత్యకుమారి పాల్గొన్నారు.

భార్యపై అలిగి ఆత్మహత్య

కాకినాడ రూరల్: భార్య తరచూ పుట్టింటికి వెళ్లడంతో అలిగిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూరంగి మహాలక్ష్మినగర్‌లో చోటు చేసుకుంది. ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. మహాలక్ష్మినగర్‌లకు చెందిన మత్స్యకారుడు అంగాడి శ్రీనివాస్(30) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు పిల్లలు. సముద్రంలో చేపల వేట ద్వారా జీవనోపాధి పొందుతున్నాడు. భార్య తరచూ గొడవ పడుతూ పుట్టింటికి వెళ్లి పోతుండడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో ఆత్మహత్యకు పాల్పడగా తండ్రి గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాగరాజు తెలిపారు. మృత దేహానికి పీఎం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని, శ్రీనివాస్ ఆత్మహత్యపై విచారణ చేపడుతున్నామన్నారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బోట్‌క్లబ్: స్థానిక పీఆర్ బాలికోన్నత పాఠశాల్లో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దంత, నేత్ర వైద్యశిబిరాన్ని మంగళవారం రోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ ప్రారంభించారు. క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలను దత్తత తీసుకొని హ్యాపీ స్కూల్స్ ప్రాజెక్టులో అభివృద్ధి చేస్తామన్నారు. నయన కంటి ఆసుపత్రి అధినేత రావుల శ్రీరామ్, భవానీ డెంటల్ హాస్పిటల్ అధినేత సతీష్ ఆధ్వర్యంలో 350 మంది బాలికలకు కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, సభ్యులు ముత్తా నవీన్, మైలవరపు సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, ధనసాగర్‌ప్రసాద్, భూపేంద్ర, సత్యపాల్, నేతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

9 నుంచి ఐటీఐ బ్రిడ్జి కోర్సు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఐటీఐ రెండేళ్ల ఉత్తీర్ణులైనవారు పాలిటెక్నిక్ రెండవ ఏడాది నేరుగా ప్రవేశం పొందడానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు సన్నద్ధం చేసేందుకు బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నారు. ఐటీఐ ప్రిన్సిపాల్..కోర్సు జిల్లా కన్వీనర్ వేణుగోపాల వర్మ మంగళవారం ఈ విషయం తెలిపారు. 9వ తేదినుంచి తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కాకినాడ ఐటీఐ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు. వివరాలకు 8919656139 నంబరును సంప్రదించవచ్చని సూచించారు.

నాణ్యత లేని వంట నూనె వాడితే కఠిన చర్యలు



అమ్మ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వంట నూనె తనిఖీ చేస్తున్న జిల్లా ఆహార సహాయ నియంత్రణ అధికారి శ్రీనివాస్

బోట్‌క్లబ్(కాకినాడసిటీ): నాణ్యత లేని వంట నూనెలు వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని జిల్లా ఆహార సహాయ నియంత్రణ అధికారి బి. శ్రీనివాస్ హోటల్ యజమానులకు సూచించారు. మంగళవారం కాకినాడలోని పలు హోటల్‌లోని వంట నూనెలను ఆయన పరిశీలించారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని పెద్దిరెడ్డి కేటరింగ్ సెంటర్, వరహాలు టిఫిన్ సెంటర్, భానుగుడి సెంటర్‌లోని ఖైదీ రెస్టారెంట్, శ్రీయతిఫుడ్స్, మహేంద్ర మిఠాయివాలా, కోకిలసెంటర్‌లోని కామాక్షి హాట్‌ఫుడ్స్, అమ్మ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో వాడుతున్న వంట నూనెలను ఆయన పరిశీలించారు. టోటల్ పోలార్ కౌంట్ మెషీన్ ద్వారా వంట నూనెలను పరిశీలించారు. రంగుమారిన నూనెలు వినియోగించి ఆహార పదార్థాలు తయారు చేస్తే ఆకస్మిక తనిఖీలు చేసి వారిపై కేసులు నమోదు చేసి జాయింట్ కలెక్టర్ కోర్టుకు తరలిస్తామన్నారు. మెషీన్‌లో 30 శాతం దాటి రీడింగ్ వస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నాగూల్‌మీరా పాల్గొన్నారు.